## క్లుప్తంగా

### ఎయిడ్స్‌ను సమూలంగా నిర్మూలించాలి


వక్తృత్వ పోటీల్లో మాట్లాడుతున్న విద్యార్థులు

ఆకివీడు: ఎయిడ్స్ మహమ్మారిని సమూలంగా నిర్మూలించాలని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత అన్నారు. సోమవారం కళాశాలలో ఎయిడ్స్ వ్యాప్తి-తీసుకోవలసిన జాగ్రత్తలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత ప్రారంభించారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి మానవ సమాజానికి విసురుతున్న సవాళ్లను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ సమన్వయ కర్త డాక్టర్ టి.ఓగేశ్వరరావు, ఆంగ్ల అధ్యాపకుడు కె.సామ్యూల్ పాల్గొన్నారు.

### సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుదాం


వన సమారాధనలో పాల్గొన్న ఏపీడబ్ల్యూఎస్ ప్రతినిధులు

ఉండి: సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందిద్దామని ఆక్వా ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోషియేషన్ (ఏపీడబ్ల్యూఏ) ప్రతినిధులు పేర్కొన్నారు. ఉండిలోని బ్లూ మెరైన్ టెక్నాలజీస్ ఫ్యాక్టరీ ఆవరణలో ఏపీడబ్ల్యూఏ వనసమారాధనను నిర్వహించారు. ఏపీడబ్ల్యూఏ ఏర్పడి 12 ఏళ్ల నుంచి రైతులకు ఉపయోగకరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. నూతన కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్ తేతలి, సతీష్ బోడపాటి, కోశాధికారి సుబ్రహ్మణ్యం పలశాల ఆధ్వర్యంలో సేవలు మరింత విస్తృతం చేస్తామన్నారు. అనంతరం కోశాధికారి సుబ్రహ్మణ్యం పలశాల వందన సమర్పణతో కార్యక్రమాన్ని ఘనంగా ముగించారు.

### రైతులు దళారులను ఆశ్రయించవద్దు

నరసాపురం: ధాన్యం అమ్మకాల విషయంలో రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని నరసాపురం ఆర్డీవో దాసి రాజు సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు రైతుసేవా కేంద్రాల ద్వారా మాత్రమే ధాన్యం అమ్మకాలు చేయలన్నారు. 48 గంటల్లో రైతుల ఖాతాల్లో ధాన్యం నగదు జమ చేస్తున్నామని చెప్పారు. ఎవరైనా రైతుల వద్ద నుంచి ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసినట్టు నిర్ధారణ అయితే చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### మహిళలపై దాడులను అరికట్టాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ

నరసాపురం: మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ అన్నారు. బీజీబీఎస్ మహిళా కళాశాలలో సోమవారం స్త్రీ హింసా వ్యతిరేక దినం సందర్భంగా నిర్వహించిన సదుస్సులో ఆమె మాట్లాడారు. పసి పిల్లలపై కూడా లైంగికదాడులు జరుగుతున్నాయన్నారు. దీనిని అరికట్టాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇటీవల తిరుపతి, విశాఖ నగరాల్లో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారాలు చూస్తుంటే తల్లితండ్రులు హడలిపోతున్నారన్నారు. విద్యార్థులు కలిసికట్టుగా సమస్య పరిష్కారానికి ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ కె.అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

### మోడీ విధానాలు సామాన్యులకు భారం


కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

పాలకొల్లు అర్బన్: బీజేపీ విధానాలకు రాష్ట్రంలోని పాలక వర్గాలు కొమ్ముకాస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు విమర్శించారు. సోమవారం స్థానిక సమతా భవన్‌లో సీపీఎం జనరల్ బాడీ సమావేశం మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. వాసుదేవరావు మాట్లాడారు. సామాన్యులపై భారం మోపి కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధంగా ప్రధాని నరేంద్ర మోడీ పాలన ఉందన్నారు. కార్యక్రమంలో చల్లా సోమేశ్వరరావు, పి.సాంబశివరావు, ఎస్.పురుషోత్తమ పాల్గొన్నారు.

# వాటర్ రిజర్వాయర్ భద్రత ప్రశ్నార్థకం


ఎటువంటి రక్షణ, భద్రత లేని భీమవరం బుధవారం మార్కెట్ వద్ద రిజర్వాయరు


శిథిలావస్థలో సిబ్బంది డ్యూటీ చేసే షెడ్డు

- సీసీ కెమెరాలు లేవు.. రక్షణ చర్యలు నిల్
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మున్సిపాలిటీకి సంబంధించి బుధవారం మార్కెట్ వద్ద ఉన్న వాటర్ రిజర్వాయర్(మంచినీళ్ల స్టోరేజి ట్యాంకు) వద్ద రక్షణ కరువైంది. భీమవరం పట్టణంలో మంచినీళ్లు అందని ప్రాంతాలకు ఈట్యాంకు నుంచి ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేస్తారు. నిత్యం లోపలకి బయటకు ట్యాంకర్లు రాకపోకలు ఉంటాయి. అలాంటి ప్రాంతంలో గతంలో మాదిరిగా రక్షణ చర్యలు నేడు లేవు. గతంలో సీసీ కెమెరాలు ఉండేవి. దాంతో అక్కడ పరిస్థితిని అధికారులు పరివేక్షించి తగు చర్యలు తీసుకునేవారు. నేడు అలాంటి పరిస్థితి లేదు ట్యాంకు లోపలకి ఎవరు వస్తున్నారు, ఎన్ని ట్యాంకులు బయటకు వెళుతున్నాయి. బయట ట్యాంకులు నింపుతున్నారా, ఎవరైనా ఆగంతకులు లోపలికి వస్తున్నారా, రాత్రులు పరిస్థితి తదితర వాటి గురించి అధికారులు తెలుసుకుని నిఘా పెట్టి ట్యాంకు వద్ద రక్షణ, చర్యలు తీసుకునే పరిస్థితి లేదు.

**నీటి దోపిడి**

ట్యాంకు వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో నీటి దోపిడీ జరుగుతుంది. నీళ్లు కావాల్సిన వారు మున్సిపాలిటికి చలానా కట్టాలి. ఇక్కడ ఒక చలానా మీద ఎక్కువ టాంకర్లు బయటకు వెళుతున్నాయి. సీసీ కెమెరాలు లేకపోవడంతో నీటి దోపిడీని మున్సిపల్ అధికారులు పసిగట్టలేకపోతున్నారు. చలానా కట్టలేని వారికి సైతం నీళ్లు నింపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. సిబ్బంది సక్రమంగా పనిచేస్తున్నారా అనేది కూడా అధికారులకు తెలిసే పరిస్థితి లేదు. ట్యాంకు దక్షిణ, ఉత్తరం వైపు ప్రహారీ గోడ పడిపోయింది. దాంతో బయట వ్యక్తులు సులభంగా లోపలకి వస్తున్నారు. వారి వల్ల మంచినీళ్లకు రక్షణ లేదు. ట్యాంకు పైకి ఎక్కి ప్రాణాలు తీసుకోవడం లేదా ట్యాంకు కలుషితం చేసే పనులు కూడా జరగవచ్చు.

**షెడ్డు శిథిలావస్థలో ఉంది**

షెడ్డు శిథిలావస్థకు చేరడంతో అక్కడ పనిచేసే సిబ్బంది ఉండటానికి నిర్మించిన షెడ్డు, ఎండ, వాన నుంచి రక్షణ లేదు. తీవ్రమైన ఎండ గాని లేదా వర్షం పడినప్పుడు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అయితే అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో ఈషెడ్డులో సీసీ కెమెరాల సిస్టమ్ ఉండేది. వర్షాలకు, ఎండకు పూర్తిగా దెబ్బ తినడంతో సీసీ కేమెరాలు తొలగించారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి ఈ వాటర్ ట్యాంకు వద్ద రక్షణ చర్యలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

### కాళ్లకూరు వెంకన్న ఆలయంలో సామూహిక వ్రతాలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కాళ్ల: కార్తీక బహుళ దశమి, సోమవారం సందర్భంగా కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతా లు నిర్వహించారు. ఏలూరు జిల్లా తాడినాడ గ్రామానికి చెందిన వేగేశ్న వెంకట సూర్య సత్య నారాయణరాజు(ఏడుకొండల రాజు) దంపతులచే సుమారు 650 మంది దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్రతమాచరించిన వారికి అన్నవరం సత్యనారాయణస్వామి ప్రసాదం, స్వామి వారి ప్రతిమలు అందజేశా రు. దేవస్థానం ఆస్థాన వేద పండితులు అనిపెద్ది ఫణికుమార్ శర్మ ఆలయ అర్చకులచే సత్య దేవుడి వ్రతాలు వేదోక్తంగా నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న వారికి దేవస్థానం ఉచిత పూజా సామాగ్రి అందజేశారు. అధిక సంఖ్య లో భక్తులు హాజరయ్యారు. ఈఓ ఎం.అరుణ్‌కుమార్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## కరాటే పోటీల్లో క్రీడాకారులకు బంగారు పతకాలు


కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం


చిన్నారి శ్రావ్యకు గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

భీమవరం: కియో జపాన్ చోటోఖాన్ కరాటే రాష్ట్రస్థాయి ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో భీమవరం వండర్‌కిడ్స్ స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని స్కూల్ చైర్మన్ అల్లు రామకృష్ణ చెప్పారు. సోమవారం పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించిన సందర్భంగా వివరాలను విలేకర్లకు వివరించారు. పోటీల్లో జె సాయిబాబు, ఎం రవికుమార్, జి అభిలాష్, ఎం శివసాయి, జి మణికంత, వైష్ణవి, హర్షపునీత్, పవన్‌గణేష్, రవికిరణ్, రోహిత్ బంగారు పతకాలు సాధించారన్నారు. అలాగే శ్రీవల్లి, మహిధర్, నాధిమ్, ప్రకాష్ రజత పతకాలు సాధించారని రామకృష్ణ వివరించారు. తమ క్రీడాకారులకు కరణం రాము, దివ్య శిక్షణ ఇచ్చారని తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో డైరెక్టర్ అల్లు వంశీకృష్ణ, హెడ్ మిస్టస్ అల్లు వనజాక్షికుమారి, ప్రిన్సిపల్ టి వాణి, మేనేజర్ శివకుమార్ తదితరులున్నారు.

**కరాటే పోటీల్లో శృంగవృక్షం చిన్నారికి గోల్డ్ మెడల్**

పాలకోడేరు: ఆకివీడులో జరిగిన ఫస్ట్ ఏపీ స్టేట్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని శృంగవృక్షం గ్రామానికి చెందిన చిన్నారి గ్రంధి శ్రావ్య కరాటేలో వైట్ బెల్ట్ సాధించి, గోల్డ్ మెడల్ అందుకుంది. స్టేట్ వైడ్ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన చిన్నారి గ్రంధి శ్రావ్యను శృంగవృక్షం గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ అభినందించారు. ఆకివీడులో ఆదివారం కీయో జపాన్ షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో జరిగిన స్టేట్ ఓపెన్ చాంపియన్ షిప్ పోటీల్లో జూనియర్స్ విభాగంలో చిన్నారి శ్రావ్య వైట్‌బెల్ట్‌లో విజయం సాధించింది.

## సెమీ క్రిస్మస్ వేడుకలు ప్రారంభం


కేక్ కట్ చేస్తున్న హోప్ బాప్టిస్టు చర్చి సంఘ సభ్యులు


ఉండి: పెదపేటలో ఏర్పాటు చేసిన భారీ క్రిస్మస్ స్టార్

ఆకివీడు: క్రిస్మస్ ప్రార్థనా కార్యక్రమాలను సోమవారం నుంచి ప్రారంభించినట్లు స్థానిక హోప్ బాప్టిస్ట్ చర్చి అధ్యక్ష, కార్యదర్శులు సోడదాసి రాజ్‌కుమార్, ఎం.సందీప్ చంద్ర చెప్పారు. స్థానిక వెంకయ్య వయ్యేరు వంతెన వద్ద ఉన్న హోప్ చర్చి నుంచి సంఘ ప్రతినిధులు, సంఘ పెద్దలు ప్రదర్శనగా ప్రధాన సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం వైఎస్సార్ సెంటర్‌లో ప్రార్థనలు చేసి కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ ట్రెజరర్ మల్లింపల్లి ప్రసాద్, పాస్టర్ సత్యానందం, ఆనంద్, కురెళ్ల పాలు, చిట్టిబాబు, జాన్సన్, తదితరులు పాల్గొన్నారు.

**ఉండిలో**

ఉండి: మండలంలో క్రిస్మస్ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉండి పెదపేట సెయింట్ పాల్స్ లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో 25 అడుగుల భారీ స్టార్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన ఉదయకాల క్రిస్మస్ ఆరాధన ప్రార్థనా కార్యక్రమాలను రెవరెండ్ మానుకొండ ప్రసన్నకుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ, ఎల్‌సీసీ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## చెరువుల అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కాళ్ల: చట్టంలోని నిబంధనలను తుంగలో తొక్కి రెండు పంటలూ పండే భూములను అక్రమ పద్ధతిలో రొయ్యల చెరువులు తవ్వేందుకు సిద్ధమవుతున్న రైతులపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. అర్చకుల భూమిని చెరువుగా మార్చడాన్ని సీపీఎం నాయకులు సోమవారం అభ్యంతరం వ్యక్తం చేసి, నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మండలంలోని జువ్వలపాలెం గ్రామంలోని సంతోషపురంకి ఆనుకుని ఉన్న భీమేశ్వరస్వామి దేవస్థానం భూమి అర్చకులకు చెందినదని, సారవంతమైన భూమిని రొయ్యల చెరువుగా తవ్వేందుకు అధికారులు అనుమతులిచ్చారని చెబుతున్నారన్నారు. అధికారులు కాసులకు కక్కుర్తిపడి అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. చెరువు తవ్వకం పనులను చేపట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గాతల అల్ఫన్స్, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, గండికోట వెంకటేశ్వరరావు, కత్తుల చిన్న, గాతల డేవిడ్ పాల్గొన్నారు.

## యోగాతోనే మానసిక ఆరోగ్యం సాధ్యం


ఉచిత యోగా శిక్షణా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: ఆరోగ్యమే మహాభాగ్యమని యోగాతో మానసిక ప్రశాంతత, శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలెన్నో ఉన్నాయని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో సకారాత్మ ఫౌండేషన్ సంకల్ప సమాధి యోగ ఆధ్యాత్మిక ఆరోగ్య సేవా సంస్థ సంకల్ప సమాధి యోగ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత యోగ, ధ్యాన శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. యోగాతో శారీరక శ్రమ మాత్రమే కాదని, ఒత్తిడి, ఆందోళనను తగ్గించుకోవచ్చునన్నారు. ఉచిత యోగ శిక్షణలో ప్రతి ఒక్కరూ పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని అంజిబాబు చెప్పారు. ప్రేమ్ నిరంతర గురూజీ మాట్లాడుతూ ఒత్తిడిని జయించాలంటే యోగను ప్రతి ఒక్కరూ రోజువారి చర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు గాదిరాజు సుబ్బరాజు, చెరుకువాడ సుబ్రహ్మణ్యం రాజు, అల్లూరి వెంకట రాఘవ రాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పివి ఎస్ఎస్ఎన్ రాజు (డిటిడిసి బాబు), వబిలిశెట్టి శ్రీవేంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముదునూరి సూర్యనారాయణ రాజు, కోళ్ల నాగేశ్వరరావు, ఆదిత్య శ్రీనివాస్, వేగేశ్న రమణరాజు, బొమ్మదేవర ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమామూలేశ్వరస్వామివారికి లక్ష బిల్వార్చన


రాయకుదురులో ఉమా మూలేశ్వరస్వామివారికి లక్ష బిల్వార్చన చేస్తున్న దృశ్యం


పూజలందుకున్న స్వామివారు

వీరవాసరం: మండలంలోని రాయకుదురులో ఉమామూలేశ్వరస్వామికి శ్రీ కృష్ణ దేవరాయ కాపు తెలగా సంఘ ఆధ్వర్యంలో సోమవారం లక్ష బిల్వార్చన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఏకాదశి మహా రుద్రాభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు విశేష హోమాలు జ్యోతిర్లింగార్చన వేద పండితుల ఆశీర్వచనాలు కన్నుల పండుగ నిర్వహించారు. అనంతరం కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఈతకోట శ్రీనివాస్ దంపతులు, ఈతకోట నాగబాబు, ఈతకోట నాని బాబు దంపతులు శ్రీకృష్ణదేవరాయ కాపు తెలగ సంఘ సభ్యులు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

**భక్తజనంతో పోటెత్తిన శైవక్షేత్రాలు**

వీరవాసరం: కార్తీక మాసం సందర్భంగా సోమవారం మండలంలోని శైవక్షేత్రాలన్నీ కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద క్యూ లైన్‌లో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరవాసంలో వీరేశ్వర విశ్వేశ్వర స్వామి ఆలయంలోనూ కొణితివాడలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలోనూ మడుగు పోలవరం, అండలూరు, మత్స్యపురి, తోలేరు పెరికిపాలెం, పంజా వేమవరం, చింతలకోటి గరువు గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**కనుల పండువగా కార్తీక దీపోత్సవం**


ఆకివీడు ధర్మాపుర అగ్రహారంలో పురాతన శివలింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

ఆకివీడు: కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. హర హర మహాదేవ, శంభో శంకర అంటూ భక్తుల కోలాహలాలతో ఆలయాలు హోరెత్తాయి. శివోహం అంటూ భక్తుల నినాదాలతో ఆయా ప్రాంతాలు పునీతమయ్యాయి. మండలంలోని అజ్జమూరు గ్రామంలోని పద్మావతి కల్యాణ మందిరంలో హరే కృష్ణ గోకుల క్షేత్రం ఆధ్వర్యంలో దామోదర కార్తీక దీపోత్సవం నిర్వహించారు. స్థానిక వేంకట లింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు సుబ్రహ్మణ్య రవి ఆధ్వర్యంలో స్వామికి క్షీరాభిషేకాలు చేశారు. మండలంలోని అయిభీమవరంలోని అమృతలింగేశ్వర స్వామి ఆలయంలో క్షీరాభిషేకాన్ని అర్చకులు గూడూరి రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక మాదివాడలోని మల్లేశ్వరస్వామి, భీమేశ్వరస్వామి, రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

## మావుళ్లమ్మకు విశేష పూజలు


అమ్మవారి ఆలయం వద్ద లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మావుళ్లమ్మవారి దేవస్థానంలో కార్తీక సోమవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో దీక్షాపరులు, భక్తులచే ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ లక్ష దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా కోటి దీపోత్సవం


కార్తీక కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: శంకర మఠంలోని శారద అమ్మవారి దేవస్థానంలో కార్తీక సోమవారం సందర్భంగా నిర్వహించిన కార్తీక కోటి దీపోత్సవాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ( అంజిబాబు) ప్రారంభించారు. ముందుగా భోగిరెడ్డి సురేంద్రనాథ్, రమాదేవి దంపతులచే ఆలయ అర్చకులు ఘంటసాల దీక్షిత్ శర్మ, సోమేశ్వరశర్మ లచే అభిషేకాలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ కార్తీక మాసంలో ఒక్క దీపం వెలిగించిన ఎంతో పుణ్య ఫలమని, ఇటువంటి కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించడం గొప్ప విశేషమని అన్నారు. ధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

## డీఎన్నార్ అసిస్టెంట్ సెక్రటరీగా రామకృష్ణరాజు


భీమవరం డీఎన్నార్ కళాశాల అసిస్టెంట్ సెక్రటరీగా ఎంపికైన రామకృష్ణరాజును అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాల అసోసియేషన్ అసిస్టెంట్ సెక్రటరీగా రుద్రరాజు రామకృష్ణరాజు ఎంపికయ్యారు. ఇప్పటి వరకు అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేసిన కొత్తపల్లి శివరామరాజు ఇటీవల మృతి చెందడంతో అసిస్టెంట్ సెక్రటరీగా రామకృష్ణరాజును గవర్నింగ్ బాడీ సమావేశంలో ఎంపిక చేసినట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) సోమవారం విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగు నిర్మాణ పనులు సక్రమంగా జరిగేవిధంగా రామకృష్ణరాజు పర్యవేక్షిస్తారన్నారు. అనంతరం అసిస్టెంట్ సెక్రటరీగా ఎంపికైన రామకృష్ణరాజును వెంకటనర్సింహరాజు, బాబు, ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, సీహెచ్ శ్రీనివాసరాజు(బోసు), అసిస్టెంట్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె రామకృష్ణంరాజు తదితరులు అభినందించారు.

## పంచామృతాలతో స్వామివారికి అభిషేకం


పంచామమృతాలతో పూజలందుకుంటున్న చెన్నమల్లేశ్వరస్వామి

ఉండి: కార్తీకమాసం నాల్గో సోమవారాన్ని పురస్కరించుకుని ఉండి రాజులపేటలో వేంచేసియున్న పార్వతీ సమేత మల్లిఖార్జునస్వామికి పంచామృతాలతో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు కార్తీక వనసమారాధన నిర్వహించారు. సాయంత్రం నుంచి పార్వతీ మల్లీఖార్జున స్వామి వార్లకు విశేష అలంకరణ, ఆకాశ దీపారాధన, దీపాలంకణ, జ్యోతిర్లింగార్చన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు సన్నిధిరాజు కృష్ణ,సన్నిధిరాజు చలపతిరావు, తాడేపల్లి కిరణ్‌శర్మ, ఏలూరుపార్టీ ఫణిశర్మ, కొత్తలంక శ్రీరామచంద్రమూర్తి, మిడన్న ప్రదీప్, పువ్వాడ అనంత్ శర్మ, తదితరులు నిర్వహించారు.

### పీజీఆర్ఎస్‌లో నాలుగు ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కారం (పీజీఆర్ఎస్)లో నాలుగు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్ సోమవారం చెప్పారు. మండలంలోని అయిభీమవరం గ్రామంలో కనుమూరు కృష్ణవేణి భూమిలోకి సరిహద్దుదారులు మురుగునీరు వదులుతున్నారని, ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. స్థానికంగా నివసిస్తున్న కోళ్లపర్తి సాంబశివరావు తన సరిహద్దుదారుడు భూమిని ఆక్రమించాడని, సర్వే చేస్తున్నా దౌర్జాన్యానికి వస్తున్నారని పోలీసు రక్షణ కల్పించాలని కోరారన్నారు. సాలిపేటలో ర్యాంపు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని, అజ్జమూరు గ్రామంలోని తన వ్యవసాయ భూమి సరిహద్దులో ఉన్న వెంకటేశ్వరా ఐస్ కోల్డ్ స్టోరేజ్ ఫ్యాక్టరీ యజమానులు విద్యుత్ వైర్లు లాగి, పైప్‌లైన్లు వేసి ఇబ్బంది పెడుతున్నారని గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారని శ్రీకర్ వివరించారు.

### వనసమారాధన

మొగల్తూరు: కార్తీక మాసంలోనే కాకుండా తరుచుగా మనమంతా కలుసుకోవడం తీపి గుర్తులుగా ఉంటాయని పలువురు నాయకులు పేర్కొన్నారు. సోమవారం మొగల్తూరులోని కోట ప్రాంతంలోని కాపు సామాజిక వర్గం వనసమారాధనను ఏర్పాటు చేశారు.